క్లుప్తంగా

రాజగోపుర నిర్మాణానికి విరాళం



దాతలకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి శనివారం ఓ భక్తుడు రూ.లక్ష విరాళంగా అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. డోన్‌కు చెందిన తల్లం ద్వారక వాసు, తల్లం పద్మజ దంపతులు రూ.లక్షను దేవాలయ కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా విరాళంగా అందజేశారని చెప్పారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు, లడ్డు, బాండు అందజేశారు.

గడ్డి వాములు దగ్ధం

మంత్రాలయం : మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన బోయ ముక్కరప్పకు చెందిన రెండు గడ్డివాములు శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వీచిన ఈదురుగాలులకు గడ్డి వాముల పైనున్న విద్యుత్ తెగిపడి మంటలు వ్యాపించాయి. మంటలు ధాటికి గడ్డి కాలి బూడిదైంది. విషయం తెలుసుకున్న ఎమ్మిగనూరు ఫైర్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. దాదాపు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుదుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయంతో పాటు అగసలదిన్నె, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను చేపట్టారు. భక్తులు తరలిరావడంతో ఆయా ఆలయాలు కిటకిటలాడాయి. అలాగే మండల కేంద్రంలోని ఆంజనేయ, వేంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలను చేపట్టారు.

మంగరాయ స్వామికి ప్రత్యేక పూజలు

ఆదోని అర్బన్ : పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మేనేజర్ వాసుదేవ రావు, పూజారి గురురాజా ఆచారి స్వామి వారికి వేకువజామున తేనె అభిషేకం, ఫల పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేసి వెండి ఆభరణాలతో అలకరించారు. సాయంత్రం రథోత్సవం జరిపించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న జంపాల క్రిష్ణారెడ్డి

ఆదోని సెంట్రల్: ఆదోని ఎల్ఐసీ ఏజెంట్ల నూతన కార్యవర్గ ఎన్నికల సమావేశం శనివారం పట్టణంలోని ద్వారకా ఫంక్షన్ హాలులో జరిగింది. లియాఫీ అధ్యక్షుడు వీరారెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో సౌత్ సెంట్రల్ జోన్ ప్రెసిడెంట్ జంపాల కృష్ణారెడ్డి, అలిండియా ప్లానింగ్ కమిటీ చైర్మన్ ఎం.నారాయణ మాట్లాడుతూ ఏజెంట్లకు గ్రూపు ఇన్సూరెన్స్, గ్రాట్యుటీ పెంచాలని కోరారు. పాలసీలపై వేస్తున్న జీఎస్టీని తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె. సిద్దలింగ, సెక్రటరీగా ఎస్. రామకృష్ణ, కోశాధికారిగా యం.రఫీక్‌ను ఉక్రగీవంగా ఎన్నుకున్నారు. ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజరు హనుమంతరావు, ఐసీయూ ప్రెసిడెంట్ హెచ్. ప్రకాశ్,ఎల్ఐసీ ఏజెంట్ల డివిజనల్ ప్రెసిడెంట్ తదితరులు జయభారత్‌రెడ్డి, సెక్రటరీ కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

విత్తన ఎంపిక కీలకం

ఆలూరు: రైతులు నేల స్వభావాన్ని బట్టి విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలని ఆలూరు వ్యవసాయ సంయుక్త సంచాలకులు సునీత సూచించారు. ఆమె శనివారం మాట్లాడుతూ.. ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద మండలాల పరిధిలో గత మార్చి, ఏప్రిల్‌లో భూసార పరీక్షలను చేయించుకున్న రైతులకు వాటి ఫలితాల ఆధారంగా భూమిలో వాడాల్సిన ఎరువుల మోతాదు తదితర వాటిపై సూచనలు చేశామన్నారు. నేల స్వాభావానికి అనుగుణంగా రైతులు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై ఎంపీఈఓలు, ఏఓలు ప్రత్యేకంగా నిఘా పెట్టాలని ఆదేశించారు. సబ్‌డివిజన్‌లో దాదాపు 35 వేల ఎకరాలలో రైతులు పత్తి, పొద్దుతిరుగుడు, వేరుశనగ, కంది, ఆముదం పెసర, జొన్న, సజ్జ పంటలను సాగు చేయనున్నట్లు వెల్లడించారు.

ఇక్కడ కంటి ఆపరేషన్లు బాగా చేస్తున్నారని తెలిసింది



ఆదోనిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కంటి ఆపరేషన్లు బాగా చేస్తున్నారని తెలుసుకుని ఇక్కడికి వచ్చాం. గుత్తి పక్కన ఉన్న బుర్నకుంట గ్రామంలో దాదాపు 50 మంది ఇక్కడే ఆపరేషన్లు చేయించుకున్నారు. రోగులకు ఆపరేషన్లు బాగా చేస్తున్నారు. ఆపరేషన్ల తర్వాత ఎలాంటి ఇబ్బందులు లేవు. త్వరగా మానుతున్నాయి. దీంతో మా ఊరి వారంతా ఇక్కడికే వస్తున్నారు.

– ఓబులమ్మ, బుర్నకుంట, గుత్తి మండలం

పునర్జన్మ వచ్చినట్లుంది



కళ్లల్లో పొరలు రావడంతో కళ్లు మసక మసకగా కనిపించేది. ఏదైనా దగ్గరగా చూస్తేనే కొంత మేర కనిపించేది. ఆపరేషన్ చేయించుకున్న తర్వాత చూపు బాగా కనిపిస్తోంది. ఆపరేషన్లు చేసేటప్పుడు, చేసిన తర్వాత ఎలాంటి ఇబ్బందులు లేవు. ఎక్కడ కళ్లు పోయి ఇబ్బందులు పడతామోననే భయాన్ని పోగొట్టింది. మాలాంటి పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత ఆపరేషన్లు చేయించడం సంతోషం. ఈ ప్రభుత్వం సల్లగా ఉండాలి.

– లక్ష్మిదేవి, బుర్నాకుంట, గుత్తి మండలం

అవ్వాతాతల కళ్లల్లో వెలుగులు

- 'వైఎస్సార్ కంటి వెలుగు' కింద ఉచితంగా కంటి ఆపరేషన్లు
- నాలుగేళ్లలో 5వేల మందికి చికిత్స



ఏరియా ఆస్పత్రిలో కంటి ఆపరేషన్లు చేస్తున్న డాక్టర్ పద్మకుమార్

ఆదోని టౌన్ : అరవై ఏళ్లు దాటిన అవ్వ తాతలు చూపు మందగించి పడుతున్న ఇబ్బందులకు చెక్ పెట్టాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆరోగ్యశ్రీ కింద వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా కంటి చూపు సరిగా లేని వారిని గుర్తించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసి వారి కళ్లల్లో వెలుగులు నింపుతోంది. ఆపరేషన్‌కే పరిమితం కాకుండా అద్దాలు, మందులు అందజేస్తుండటంతో వారికి అదనపు ఖర్చులు లేకుండా చూస్తోంది.

స్థానిక ఏరియా ఆసుపత్రిలో..

ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కంటి వెలుగు పథకం కింద వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా అవ్వాతాతలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తున్నారు. గడిచిన నాలుగేళ్లలో దాదాపు 5 వేల కంటి ఆపరేషన్లను చేశారు. కంటి వైద్యనిపుణుడు పద్మకుమార్ 60 సంవత్సరాలు పైబడిన అవ్వాతాతలకు క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేస్తున్నారు. డివిజన్‌లోని 17 మండలాల్లోని వృద్ధులకు రోజుకి ఐదుగురు ప్రకారం నెలకు 120, ఏడాదికి దాదాపు 1400 మందికి ఆపరేషన్లు చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు మెరుగ్గా చేస్తున్నారని, డాక్టర్‌పై నమ్మకంతో డివిజన్‌లోని ఆలూరు, ఆదోని, పత్తికొండ, కోసిగి, మంత్రాలయం, గుత్తి తదితర ప్రాంతాల నుంచి వచ్చి ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. దీంతో కంటి సమస్య ఉన్న వృద్ధులు వైద్యులను సంప్రదించి చూపు తిరిగి తెప్పించుకుంటున్నారు.

అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తున్నాం



ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే అవ్వాతాతలకు ముందుగా ముందుగా పరీక్షలు చేసి అవసరమైనట్లు తేలితేనే ఆపరేషన్లు చేస్తున్నాం. రోజుకు ఐదారుగురికి ఆపరేషన్లు చేస్తున్నాం. ఆపరేషన్లు చేయించేందుకు ప్రభుత్వ ఆస్పత్రికి చాలామంది పేదలు వస్తున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న ఆపరేషన్లు, పరీక్షలకు అవసరమైన వసతులను కల్పించడంలో సహాయ, సహకారాలు అందిస్తున్నారు.

– పద్మకుమార్, కంటి వైద్యనిపుణుడు, ఆదోని ఏరియా ఆస్పత్రి

భజరంగ్ దళ్ నూతన కమిటీ ఎన్నిక

కోసిగి: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని నిమ్మలోట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ప్రాంగణంలో భజరంగ్ దళ్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం స్థానిక ఆలయం వద్ద విశ్వహిందూ పరిషత్ ఆదోని శాఖ ఆధ్వర్యంలో మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా ముకుంద కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడుగా గోరంట్ల రామాంజనేయులు, ఉప్పలపాటి అర్జున్, ప్రధాన కార్యదర్శిగా వీరుపాక్షి, కార్యవర్గ సభ్యులు పులుసు ఉశేని, బీరప్ప, శ్రీకాంత్, రామాంజి, విశ్వనాథ్‌ను ఎన్నుకున్నారు.

బెల్లం ఊట ధ్వంసం



నాటుసారా స్థావరంపై దాడులు చేస్తున్న సెబ్ పోలీసులు

ఆదోని రూరల్ : పట్టణంలోని ఇస్వీ కొండపైనున్న నాటుసారా తయారీ కేంద్రంపై దాడి చేసి అక్కడున్న 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ హరికృష్ణ శనివారం తెలిపారు. అలాగే పది లీటర్ల సారా స్వాధీనం చేసుకొని నిందితుడు బోయ ఉదయ్ కుమార్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. సెబ్ ఎస్ఐలు శివప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, పీసీలు పాల్గొన్నారు.

పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రధానమంత్రి కృషి సంచాయ యోజన (డబ్ల్యూబీసీ–పీఎంకేఎస్‌వై 2.0) పథకం ద్వారా అందించే వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సూచించారు. శనివారం పెద్దహరివాణంలో నిర్వహించిన వాటర్ షెడ్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని పెద్దహరివాణం, సంతెకూడ్లూరు, బలదూర్, యడవలి గ్రామాల రైతులకు వ్యవసాయ పరికరాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పెద్దహరివాణంలో 260 మందికి, సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన 49 మందికి, బలదూర్‌లో 47 మంది రైతులు, యడవలిలో 30 మంది రైతులకు స్ప్రేయర్ పంపులు, మోటార్‌లు, టార్పాలిన్లు అందజేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం 60 శాతం వాటాతో, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటాను భరించిందన్నారు. అడిషనల్ పీడీ సలీం బాషా, పీఓ వలీబేగ్, డీఎం ఆగ్రోస్ జయచంద్రారెడ్డి, పెద్దహరివాణం సర్పంచ్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

స్పీడు బ్రేకర్లకు పెయింటింగ్ వేయరూ!



ఎంఎం కాలనీ ప్రధాన రహదారిలో పెయింటింగ్ లేకపోవడంతో సాధారణ రోడ్డుగా కనిపిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్ : పట్టణంలోని ప్రధాన రహదారుల్లో స్పీడు బ్రేకర్లు ఉండే ప్రాంతాల్లో పెయింటింగ్ వేయకపోవడంతో సాధారణంగా కనిపిస్తున్నాయి. దీంతో వాహనదారులు వేగంగా వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎంఎం కాలనీ వద్ద, కొత్త బస్టాండుకు వెళ్లే ప్రధాన రహదారిలో స్పీడు బ్రేకర్లకు పెయింటింగ్ లేకపోవడంతో వారం క్రితం బైకుపై తల్లీ,కుమారుడు వెళ్తాండగా స్పీడు బ్రేకర్‌ను గమనించలేకపోవడంతో బైకుపై వెళ్తున్న మంగమ్మ కింద పడింది. ఆమెను వెంటనే ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. తలకు తీవ్ర గాయమవడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలులో నాలుగు రోజులపాటు చికిత్స పొంది కోలుకోలేక మూడు రోజుల క్రితం మృతి చెందిందని కాలనీవాసులు తెలిపారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి సూచికలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంపు



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసిన దృశ్యం

ఆదోని అర్బన్ : గత నెల 8వ తేదీ నుంచి ఆదోని శాఖా గ్రంథాలయంలో ప్రారంభమైన సమ్మర్ క్యాంపు శనివారం ముగిసింది. గ్రంథాలయాధికారిణి సుజాత ఆధ్వర్యంలో జరిగిన ముగింపు వేడుకల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, మున్సిపల్ చైర్‌పర్సన్ శాంతను సన్మానించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిబిరం ద్వారా వివిధ అంశాలపై విజ్ఞానాన్ని సంపాదించుకున్నారన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు, రికార్డు అసిస్టెంట్ దేవేంద్ర, మంగమ్మ పాల్గొన్నారు.

ఇద్దరి బలవన్మరణం

మంత్రాలయం రూరల్: మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన బోయ శారదమ్మ (50) కడుపు నొప్పి తాళలేక పురుగు మందుతాగి బలవన్మరణానికి పాల్పడిందని ఏఎస్ఐ ఆనందరెడ్డి శనివారం తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు. పోస్టుమార్టం నిర్వహించి భర్త నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నిద్ర మాత్రలు మింగి..




మృతిచెందిన గాయత్రి

ఆదోని అర్బన్ : ఆలూరు మండలం కమ్మరచేడు గ్రామానికి చెందిన గాయత్రి (26) ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిద్రమాత్రలు మింగి శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. బంధువులు తెలిపిన మేరకు వివరాలు.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిద్రమాత్రలు మింగి అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స చేస్తుండగా మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు సంతానం. కాగా.. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

హరివిల్లు.. కనువిందు

కోసిగి: మండల కేంద్రంలో హరివిల్లు కనువిందు చేసింది. శనివారం సాయంకాలం కోసిగిలో భారీ ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది. వర్షం నిలిచిన వెంటనే తిమ్మప్ప స్వామి కొండపై భాగంలో ఇంద్రధనస్సు విరబూసిన దృశ్యం కనువిందు చేసింది.





జంపాపురం వద్ద ఎద్దుల కాడితో సాళ్లు చేస్తున్న రైతు



పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

ఖరీఫ్ సాగు ప్రారంభం

కోసిగి: ఏరువాక పండుగ ముగిసింది. మండలంలోని జంపాపురం, ఐరన్‌గల్లు, సాతనూరు గ్రామాల్లో గురువారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఓ వైపు రైతులు కాడెద్దులతో సాళ్లు చేస్తుండగా మహిళలు పత్తి విత్తనాలు నాటుతున్నారు. ఆ వెంటనే గుంటుక పాస్తున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో రైతన్నలు బిజీగా మారారు. మండలంలో 32,420 ఎకరాల్లో ఖరీఫ్‌లో పంటలు సాగు చేయనున్నారు. అత్యధికంగా 80శాతం పత్తి, 10 శాతం వేరుశనగ, 10 మిరప, ఉల్లి, కంది తదితర పంటలు వేయనున్నారు. కాగా.. పంటల సాగుకు ముందు సమృద్ధిగా వర్షాలు కురిసి మంచి పంటలు పండాలని, రైతాంగం సంతోషంగా ఉండాలని గ్రామ దేవతలకు, భూమాతకు పూజలు చేసి పనులకు ఉపక్రమించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆదోని అర్బన్ : మండలంలోని కుప్పగల్ రైల్వేస్టేషన్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి శనివారం తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగా మృతిచెందాడని వైద్య సిబ్బంది తెలిపారు. మృతుడి వయస్సు దాదాపు 40 సంవత్సరాలు ఉంటుందని, అనారోగ్యంతో కుప్పగల్ రైల్వేస్టేషన్‌లో ఉండేవాడని చెప్పారు. అకస్మాత్తుగా అస్వస్థతకు గురవగా స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కుక్క దాడిలో వృద్ధుడికి గాయాలు



చికిత్స పొందుతున్న ఖాజాబేగ్

ఆదోని అర్బన్ : స్థానిక కోట వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఓ వృద్ధుడిపై శనివారం ఓ కుక్క దాడి చేసింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఖాజాబేగ్ బైకుపై వస్తుండగా ఒక్కసారిగా కుక్క కాలు కరించింది. దీంతో ఆయన కింద పడిపోయాడు. అయినా మళ్లీ తీవ్రంగా దాడి చేసిందని బాధితుడు వాపోయాడు.

బాలుడి అప్పగింత



తండ్రి గోవింద్ చెంతకు చేరిన బాలుడు కార్తీక్

ఆదోని అర్బన్ : పట్టణంలోని కౌడల్‌పేటలో దిక్కుతోచని స్థితిలో తిరుగుతున్న బాలుడు కార్తీక్‌ను విద్యార్థి సంఘం నాయకుడు జై త్రీటౌన్ పోలీసులకు అప్పగించాడు. అంతకు ముందు బాలుడి వివరాల కోసం కాలనీలో విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు అప్పగించినట్లు జై తెలిపాడు. ఇదిలా ఉండగా.. తల్లిదండ్రులు బాలుడి కోసం వెతుకుతుండగా స్థానికుల సమాచారం మేరకు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. తాము కడిమెట్ల గ్రామం నుంచి ఆదోనిలో జరిగే వివాహ వేడుకలకు వచ్చామని ఈ క్రమంలో బాలుడు తప్పిపోయాడని చెప్పాడు. అన్నీ నిర్ధారించుకున్న పోలీసులు బాలుడిని తండ్రికి అప్పగించారు.

ప్రమాదం అంచున..



పంచాయతీరాజ్ డీఈ కార్యాలయం మెట్ల వద్ద పెచ్చులు ఊడిన దృశ్యం

ఆదోని రూరల్ : పట్టణంలోని పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈ) కార్యాలయ భవనం బాల్కనీ క్యాబిన్ ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. డీఈ కార్యాలయం, పక్కనే ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి నిత్యం ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎంతోమంది వస్తుంటారు. అయితే ఈ క్యాబిన్ ఎప్పుడు కూలి పడుతుందోనని కార్యాలయాల సిబ్బంది, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలుమార్లు పెచ్చులూడి పడిందని, మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

అక్రమంగా కేసులు నమోదు చేస్తే సహించం



పాదయాత్రలో పాల్గొన్న సుభాష్‌చంద్రబోష్

మంత్రాలయం: ఏ వర్గంపైనా ఉద్దేశపూర్వకంగా దాడులు చేయాల్సిన అవసరం తమకు లేదని, అక్రమంగా కేసులు నమోదు చేస్తే సహించేది లేదని వీఆర్‌పీస్ రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోష్ అన్నారు. శనివారం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా రెండు వర్గాల మధ్య జరిగిన గొడవ కారణంగా దళితులపై దాడులు చేశారని ఫిర్యాదు చేయడంతో గ్రామంలోని 23 మందికి పైగా వాల్మీకులపై కేసులు నమోదు చేశారు. అయితే అక్రమంగా నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని కోరుతూ గ్రామం నుంచి మాధవరం పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టారు. మాలపల్లి గ్రామానికి చేరుకున్న సుభాష్‌చంద్రబోష్‌ను సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కిరణ్ అడ్డుకున్నారు. దీంతో రచ్చుమర్రికి చెందిన వాల్మీకులు ఆదోని–రాయచూర్ రహదారిపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య అక్కడికి చేరుకుని సుభాష్‌చంద్రబోష్ గ్రామానికి వస్తారని అయితే మాధవరం వరకు పాదయాత్ర వద్దని సూచించారు. గ్రామానికి చేరుకున్న సుభాష్‌చంద్రబోష్‌కు పెద్ద ఎత్తున స్వాగతం పలికి బస్టాండ్ నుంచి గ్రామ శివారులోని ఆంజనేయస్వామి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ నిజంగా దాడులకు పాల్పడిన వారిని శిక్షించాలని కోరారు. అక్రమంగా కేసులు నమోదు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. వాల్మీకులు కుడా మిగిలిన వర్గాల ప్రజలతో కలిసి మెలసి జీవించాలని సూచించారు. సీఐ ఏరిషావలి, ఎస్ఐలు రాజారెడ్డి, నరేంద్రకుమార్‌రెడ్డి, రమేష్‌బాబు, శ్రీనివాసులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

రోడ్లు బాగు చేయండి



రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి సమస్యలను వివరిస్తున్న దృశ్యం

మంత్రాలయం: నియోజకవర్గంలోని కౌతాళం మండలం కామవరం నుంచి ఉరుకుందకు వెళ్లే రోడ్డు దీంతో పాటు పలు రోడ్లను బాగు చేయాలని మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య ఎమ్మెల్యే పీఏ వెంకట్రామిరెడ్డి కోరారు. శనివారం మంత్రాలయం వచ్చిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రద్యుమ్నను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు కలిశారు. వారు మాట్లాడుతూ మంత్రాలయం పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించిన నివేదికల ను ఆయనకు అందజేశారు. త్వరలోనే మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని ప్రద్యుమ్న హామీ ఇచ్చారు.

శ్రీ మఠంలో జిల్లా స్పెషల్ ఆఫీసర్

శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా స్పెషల్ ఆఫీసర్ ప్రద్యుమ్న శనివారం సాయంత్రం మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈయనకు శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులు శేషవస్త్రం కప్పి, స్వామి వారి మెమెంటో, ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వదించారు. అంతకు ముందు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ.నరసింహామూర్తి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య ఉన్నారు.

పిడుగు పాటుకు ఎద్దు మృతి



కోసిగి: స్థానిక భూగేని చెరువు సమీపంలో మానికింద ఈరన్నకు చెందిన ఎద్దు పిడుగు పాటుకు గురై మృతి చెందింది. శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది. ఉరుముల భారీ శబ్దానికి పొలాల్లో ఉన్న ఎద్దు ఒక్కసారిగా కుప్పకూలింది. ఎద్దు పిడుగుపాటుకు గురైందని తెలుసుకొని స్థానికులు పరుగులు తీశారు. అయితే అప్పటికే మృతి చెందిందని గుర్తించారు.